క్లుప్తంగా

ముగిసిన లక్ష్మీమాధవుడి బ్రహ్మోత్సవాలు



పూజలందుకున్న లక్ష్మీమాధవస్వామి

కోడుమూరు రూరల్: మండలంలోని గోరంట్ల గ్రామంలో వెలసిన లక్ష్మీమాధవస్వామి బ్రహ్మోత్సవాలు శనివారం ముగిశాయి. చివరి రోజు జరిగిన హంసవాహన సేవ, వసంతోత్సవం, శ్రీచక్రస్నానం, కంకణ విసర్జన కార్యక్రమాలతో ఘనంగా నిర్వహించారు. 12 రోజుల పాటు స్వామి వారి ఉత్సవాలను దేవదాయశాఖ అధికారులు, గ్రామస్తులు వైభవంగా నిర్వహించారు. ఉత్సవాలకు జిల్లా నలుమూలల నుంచే గాక ఇతర రాష్ట్రాల నుంచి భారీ సంఖ్యలో భక్తులు హాజరయ్యారు.

కోనా వేంకటేశ్వరుడికి ప్రత్యేక పూజలు

సి.బెళగల్: మండల పరిధిలోని క్రిష్ణదొడ్డి గ్రామ కొండపై వెలసిన కోనా వేంకటేశ్వర స్వామి వారికి శనివారం పూజారులు ప్రత్యేక పూజలను నిర్వహించారు. భూదేవి, అలివేలిమంగమ్మ సమేత కోనా వేంకటేశ్వర స్వామి మూల విగ్రహాలకు అభిషేక పూజలతో పాటు ప్రత్యేక పుష్ప, పత్రాలతో అలంకరించి పూజా కార్యక్రమాలను చేపట్టారు.

పెద్దమ్మ ఆలయ అభివృద్ధికి సహకరించండి



మూలపెద్దమ్మ ఆలయానికి విరాళం అందిస్తున్న దాతలు

గడివేముల: మండల కేంద్రంలోని మూలపెద్దమ్మ ఆలయ అభివృద్ధికి సహకరించాలని ఈఓ రామలింగారెడ్డి కోరారు. శనివారం నంద్యాల పట్టణానికి చెందిన జొన్నగడ్డ నాగరాజు, తదితరులు ఆలయం చుట్టూ ఉన్న కాలువల మరమ్మతులకు రూ.50 వేలు అందజేశారు. దాతలను సన్మానించి అమ్మవారి తీర్థప్రసాదాలను అందజేశారు. కార్యక్రమంలో దేశం రమణారెడ్డి, నరేంద్రారెడ్డి, ఆలయ సిబ్బంది రామసుబ్బయ్య తదితరులు పాల్గొన్నారు.

నేడు మండల సర్వసభ్య సమావేశం

కల్లూరు: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఆదివారం సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ నాగేషా చల్లారెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపీపీ బోయ శారద అధ్యక్షతన జరిగే సమావేశానికి మండల అధికారులు, ప్రజాప్రతినిధులు తప్పక హాజరుకావాలని సూచించారు.

పరిసరాల పరిశుభ్రతపై అవగాహన

కల్లూరు: కర్నూలు ప్రభుత్వ నర్సింగ్ కళాశాల విద్యార్థినులు పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. శనివారం సల్కాపురంలో ఎన్ఎస్ఎస్ ప్రత్యేక కార్యక్రమంలో భాగంగా చార్టుల ద్వారా అంటు వ్యాధులు, తీసుకోవాల్సిన జాగ్రత్తలను స్థానికులకు వివరించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ మంజుల రాణి మాట్లాడుతూ.. పరిసరాలతో పాటు వ్యక్తిగత పరిశుభ్రత అవసరం అన్నారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ అన్నపూర్ణ, నాగరత్న పాల్గొన్నారు.

గడివేముల ఎస్ఐకి ప్రశంసాపత్రం



ఎస్పీ నుంచి ప్రశంసాపత్రం అందుకుంటున్న ఎస్ఐ నాగార్జునరెడ్డి

గడివేముల: ప్రజా సమస్యల పరిష్కారంలో ఉత్తమ ప్రతిభ చూపిన ఎస్ఐ నాగార్జునరెడ్డికి శనివారం నంద్యాల ఎస్పీ అధిరాజ్‌సింగ్ రాణా ప్రశంసా పత్రం అందజేశారు. ప్రతి సోమవారం జిల్లా స్థాయిలో, మండల స్థాయిలో వచ్చే ఫిర్యాదులను సకాలంలో పరిష్కరించి బాధితులకు న్యాయం చేకూరే విధంగా ఎస్ఐ కృషి చేస్తున్నారు. ఇందులో భాగంగా ప్రతి నెలా జరిగే క్రైం మీటింగ్‌లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన అధికారులకు ప్రశంసా పత్రాలు అందజేస్తున్నారు.

ఆర్థిక సహాయం

కర్నూలు(సెంట్రల్): ఓర్వకల్ మండలం పూడిచెర్లకు వచ్చిన డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌కు తమ పిల్లలకు వైద్యం చేయించాలని వికలత్వంతో బాధపడుతున్న చిన్నారుల తల్లిదండ్రులు అభ్యర్థించారు. అందుకు ఆయన స్పందించి తక్షణ సాయంగా ఒక్కొక్కరికీ రూ.50 వేలు చొప్పున ముగ్గురికి ఇవ్వాలని ఆదేశించడంతో కలెక్టర్ పి.రంజిత్‌బాషా శనివారం సాయంత్రం తన కార్యాలయంలో బాధిత పిల్లలు, వారి తల్లిదండ్రులకు చెక్కులు అందజేశారు.



నిజం.. ఇది బస్ షెల్టరే..!

పాణ్యం మండల పరిధిలోని తమ్మరాజుపల్లె గ్రామం వద్ద జాతీయ రహదారి పక్కనే ఓ కర్రలతో నిర్మించిన బస్‌షెల్టర్ అందరినీ ఆశ్చర్యానికి గురి చేస్తుంది. రోడ్డు పక్కనే కర్రలను పాతి.. పైన తాటాకులు, ఆపైన ప్లాస్టిక్ పట్టలను కట్టారు. గ్రామం నంచి ఎవరైనా కర్నూలు వైపు వెళ్లాలంటే ఈ షెల్టర్ కిందకు రావాల్సిందే. ఇక్కడే బస్సు ఎక్కుతారు. అధికారులు చర్యలు తీసుకుని ప్రజలకు అందుబాటులో ఉండే షెల్టర్‌ను నిర్మించాలని స్థానికులు కోరుతున్నారు.

– పాణ్యం

హంద్రీనదిలో చిన్నారుల సందడి

కోడుమూరు మండలం గోరంట్ల గ్రామంలో వెలసిన లక్ష్మీమాధవుడి బ్రహ్మోత్సవాలు వైభవంగా సాగుతుండగా మరోవైపు జాతరకు వచ్చిన ప్రజలు మండుతున్న ఎండలను తట్టుకోలేక హంద్రీనదిలో సేదతీరుతున్నారు. శనివారం చిన్నారులు ఎండల నుంచి ఉపశమనం పొందేందుకు సరదాగా ఈత కొడుతుండగా 'సాక్షి' క్లిక్ మనిపించింది.

– కోడుమూరు రూరల్



హంద్రీనదిలో ఈత కొడుతున్న చిన్నారులు



తమ్మరాజుపల్లె వద్ద రాంగ్‌రూట్‌లో వస్తున్న టిప్పర్

రాంగ్‌రూట్.. జరభద్రం

పాణ్యం మండల పరిధిలోని తమ్మరాజుపల్లె గ్రామం వద్ద ఉన్న కంకర ఫ్యాక్టరీలకు రాకపోకలు సాగించే టిప్పర్లు ఇస్టానుసారంగా జాతీయ రహదారిపైకి వస్తున్నాయి. శనివారం ఉదయం టిప్పర్ రాంగ్‌రూట్‌లో వచ్చి ఫ్యాక్టరీలకు వెళ్లే క్రమంలో వేగంగా వచ్చి సడన్‌గా రోడ్డు దిగారు. దీంతో రహదారిపై వెళ్లే వాహన డ్రైవర్లు భయాందోళనకు గురయ్యారు. హైవే అధికారులు రాంగ్‌రూట్‌లో వెళ్లే వాహనాలపై చర్యలు తీసుకోవాలని డ్రైవర్లు కోరుతున్నారు.

– పాణ్యం

'దారి'ద్ర్యం

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత పల్లెల రోడ్లను పట్టించుకునే నాథుడే లేరు. కర్నూలు జిల్లా కేంద్రానికి కేవలం 7 కిలోమీటర్ల దూరంలో ఉన్న నందనపల్లె, నూతనపల్లె గ్రామాల రోడ్లు కంకర తేలి అధ్వానంగా ఉన్నా అటు అధికారులు కానీ ఇటు ప్రజాప్రతినిధులు కానీ పట్టించుకోవడమే మరిచారు. ఫలితంగా ఆయా గ్రామాల ప్రజలు రాకపోకలకు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు.

– కర్నూలు (రూరల్)



కంకర తేలిన సూదిరెడ్డిపల్లి - నందనపల్లె గ్రామాల రోడ్డు

- అధ్వానంగా పల్లె రహదారులు
- దిగుబడుల రవాణాకు తీవ్ర ఇబ్బందులు
- పట్టించుకోని పాలకులు

కర్నూలు మండల పరిధిలోని నందనపల్లె గ్రామంలో 5 వేల జనాభా, నూతనపల్లె గ్రామంలో 4 వేల జనాభా ఉంది. ఈ రెండు గ్రామాల్లోనూ రైతులు వ్యవసాయంపై జీవన సాగిస్తున్నారు. ఎక్కువగా కూరగాయలు, ఆకు కూరలు, పండ్లు, పూల తోటలు సాగు చేస్తున్నారు. 2000 సంవత్సరం వరకు నందనపల్లె బస్టాప్ నుంచి నూతనపల్లె-సూదిరెడ్డిపల్లె-పసుపల-జి.పుల్లారెడ్డి కాలేజ్ వరకు ఆర్టీసీ బస్సులు తిరిగేవి. ప్రతి రోజు రెండు మార్లు బస్సులు ప్రయాణికులతో రాకపోకలు సాగించేవారు. ఈ బస్సుల్లోనే రైతన్నలు తమ దిగుబడులను కర్నూలు నగరంలో ఉన్న సి.క్యాంప్, వ్యవసాయ మార్కెట్లుకు తరలించి విక్రయించుకునేవారు. అయితే ఈ రెండు గ్రామాలకు ఏళ్ల క్రితం నిర్మించిన రహదారులు కావడంతో పూర్తిగా అధ్వాన స్థితికి చేరుకున్నాయి. కంకర తేలి వాహనాల రాకపోకలకు వీలులేకుండా పోయింది. కొన్ని చోట్ల పొలాల రస్తాను తలపిస్తోంది. దీంతో ఆర్టీసీ బస్సు సర్వీసులు నిలిపేశారు. ఇదే అదునుగా భావిస్తున్న ప్రైవేట్ వాహనదారులు దిగుబడుల రవాణాకు బాడుగలు అధికంగా డిమాండ్ చేస్తుండటంతో రైతన్నలు ఆవేదన చెందుతున్నారు.



పొలాల రస్తాను తలపిస్తున్న నందనపల్లె - నూతనపల్లె రోడ్డు

విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారు



నందనపల్లె నుంచి నూతనపల్లెకు వెళ్లాలంటే సరైన రోడ్డు లేనందున రైతులు, విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. సరైన రోడ్డు లేనందున మా గ్రామం నుంచి కూరగాయలను నగరానికి తీసుకెళ్లాలంటే ప్రైవేట్ వాహనదారులు బాడుగు ఎక్కువ అడుతున్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి రోడ్డు ఏర్పాటు చేయాలి.

– గొల్ల విజేయుడు, నూతనపల్లె గ్రామం

తారు రోడ్డు వేయాలి



గతంలో నందనపల్లె నుంచి నూతనపల్లె వరకు రోడ్డు విశాలంగా ఉండి ఆర్టీసీ బస్సులు నడిచేవి. ఇప్పుడు రోడ్డుకు ఇరు వైపులా కంప చెట్లు పెరిగి పోయాయి. కంకర రోడ్డుపై వాహనాలు తిరగలేకపోతున్నాయి. అధికారులు తారు రోడ్డు నిర్మిస్తే రెండు గ్రామాలకు మేలు జరుగుతుంది. కూటమి ప్రభుత్వం వచ్చాక కూడా ప్రజాప్రతినిధులకు వినతిపత్రం అందజేశాం. అయినా స్పందనలేదు.

– రంగస్వామి, నందనపల్లె గ్రామం

నిధులు మంజూరైతే పనులు ప్రారంభిస్తాం



స్వర్ణాంధ్రప్రదేశ్‌లో 2025–2026 యాక్షన్ ప్లాన్‌లో భాగంగా నందనపల్లె నుంచి నూతనపల్లె వరకు 2,500 మీటర్ల రోడ్డు నిర్మాణానికి ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపాం. ప్రాధాన్యత క్రమంలో భాగంగా నిధులు మంజూరైతే రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభిస్తాం.

– ముక్తార్‌బాషా, పంచాయతీరాజ్ ఇంజినీర్ కర్నూలు మండలం

సూపర్‌సిక్స్ పథకాల అమలెప్పుడు?



ప్యాలకుర్తిలో కరెంట్ కనెక్షన్ ఇవ్వని బోరును చూపుతున్న సీపీఎం నాయకులు

కోడుమూరు రూరల్: సూపర్ సిక్స్ పథకాలను ఎప్పుడు అమలు చేస్తారని సీపీఎం మండల కార్యదర్శి రాజు ప్రశ్నించారు. ప్రజా చైతన్య యాత్రో భాగంగా శనివారం సీపీఎం నాయకులు ప్యాలకుర్తి గ్రామంలో పర్యటించి ప్రజల సమస్యలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా రాజు మాట్లాడుతూ రైతులకు ఇస్తామన్న రైతు భరోసా రూ.20 వేలు, తల్లికి వందనం, నిరుద్యోగులకు నిరుద్యోగ భృతి, 45ఏళ్ల మహిళలకు నెలకు రూ.1,500 ఇంతవరకు అమలు చేయకుండా ముఖ్యమంత్రి చంద్రబాబు కాలయాపన చేస్తూ ప్రజలను మోసం చేస్తున్నారని విమర్శించారు. మహిళలకు ఉచిత బస్సు హామీ ఎప్పటి నుంచి అమలు చేస్తారో ప్రభుత్వం ప్రజలకు సమాధా నం చెప్పాలన్నారు. అనంతరం గ్రామంలో నెలకొ న్న సమస్యలపై వారు ప్యాలకుర్తి ప్రజలతో చర్చించారు. ప్యాలకుర్తి ఎస్సీ కాలనీలో నెలకొన్న నీటి సమస్య పరిష్కారం కోసం గత వైఎస్సార్‌సీపీ ప్రభు త్వ హయాంలో బోరు వేశారని, నీళ్లు పుష్కలంగా పడినప్పటికీ బోరుకు మోటార్ బిగించి కరెంట్ కనెక్షన్ ఇవ్వకపోవడంతో కాలనీవాసులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. అధికారులు స్పందించి కనెక్షన్ ఇచ్చి కాలనీవాసుల ఇబ్బందులు తీర్చాలని సీపీఎం నాయకులు డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు గఫూర్ మియ్యా, వీరన్న, మద్దిలేటి, శంకర్, బాబు పాల్గొన్నారు.

గూడూరులో..

ప్రజా చైతన్య యాత్రో భాగంగా శనివారం సీపీఎం నాయకులు గూడూరులోని ఎస్సీ కాలనీలో పర్యటించారు. ఈ సందర్భంగా కాలనీలో నెలకొన్న నీటి సమస్య, మరుగుదొడ్లు లేక మహిళలు పడుతున్న ఇబ్బందులను వారు తెలుసుకున్నారు. ఎస్సీ కాలనీలో నెలకొన్న సమస్యల పరిష్కారానికి అధికారులు చర్యలు తీసుకోవాలని వారు కోరారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు మోహన్, రాజశేఖర్, దానమన్న, నాగేష్, సురేష్, అబ్రహం, సుధాకర్, నవీన్, ఆనంద్ పాల్గొన్నారు.

అసమానతలు లేని సమాజమే అభివృద్ధికి సూచిక



అమరవీరుల త్యాగలను వివరిస్తున్న డీవైఎఫ్ఐ నాయకులు

కర్నూలు(రూరల్): అసమానతలు లేని సమాజమే అభివృద్ధికి సూచిక అని డీవైఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు రాఘవేంద్ర అన్నారు. శనివారం ఉల్చాల జిల్లా పరిషత్ హైస్కూల్‌లో అమరవీరులు భగత్‌సింగ్, సుఖదేవ్ రాజ్‌గురు వర్ధంతి సందర్భంగా వారి చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో హెచ్ఎం సర్జున్నిసా బేగం, డీవైఎఫ్ఐ మండల నాయకులు ప్రకాష్, గోవర్ధన్, విశ్వానాథ్, శ్రీనివాసులు పాల్గొన్నారు.

ప్రైవేటు ట్రావెల్స్ బస్సు ఢీకొని వ్యక్తి మృతి



ప్రైవేటు ట్రావెల్ బస్సు

కర్నూలు సిటీ: నంద్యాల చెక్‌పోస్ట్ సమీపంలో ప్రైవేటు ట్రావెల్ బస్సు ఢీకొని ఓ వ్యక్తి మృతి చెందాడు. గణేష్‌నగర్‌కి చెందిన కర్రెన్న కుమారుడు మద్దిలేటి(60) శనివారం రాత్రి చెక్‌పోస్టు సమీపంలో రోడ్డు దాటుతుండగా కర్నూలు నుంచి చెన్నైకు వెళుతున్న ప్రైవేటు ట్రావెల్ బస్సు వేగంగా వచ్చి ఢీకొంది. తర్వాత కింద పడిపోయిన అతనిపైనే బస్సు వెళ్లడంతో శరీరం నుజ్జునుజ్జు అయింది. ఈ ప్రమాదంపై ట్రాఫిక్ పోలీసులు దర్యాప్తు చేపట్టారు. మృతుడు కూలీపని చేసుకొని జీవిస్తాడని, కుటుంబ వివరాలు తెలియాల్సి ఉందని ట్రాఫిక్ పోలీసులు తెలిపారు.

స్వీపర్‌కు మెరుగైన వైద్యం అందించాలి

కర్నూలు(హాస్పిటల్): కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో విధి నిర్వహణలో రసాయన ద్రావణం పడి గాయపడిన స్వీపర్ ఆశీర్వాదమ్మకు మెరుగైన వైద్యం అందించాలని, ఆమెకు జీతంతో కూడిన సెలవులు ఇవ్వాలని సీఐటీయూ నగర ప్రధాన కార్యదర్శి విజయ రామాంజనేయులు డిమాండ్ చేశారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న ఆమెను శనివారం ఆయన పరామర్శించారు. ట్రామాలజీ విభాగంలో విధులు నిర్వహిస్తున్న ఆశీర్వాదమ్మపై పగిలిపోయిన డబ్బాలో ఉన్న లైజాల్ అనే ద్రావణం ప్రమాదవశాత్తూ మీద పడి కాలిన గాయమైందన్నారు.

గర్భిణులకు వ్యాధి నిరోధక టీకాలు తప్పనిసరి

- సంచార చికిత్స జిల్లా నోడల్ అధికారి రఘు



టీకాల గురించి తెలుపుతున్న ఆరోగ్య కార్యకర్త

ఓర్వకల్లు: గర్భిణులు, బాలింతలకు వ్యాధి నిరోధక టీకాలు తప్పనిసరిగా వేయించాలని సంచార వైద్య చికిత్స జిల్లా నోడల్ అధికారి రఘు అన్నారు. శనివారం హుసేనాపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని తిప్పాయపల్లె పంచాయతీ కార్యాలయంలో జరుగుతున్న సంచార చికిత్స కార్యక్రమాన్ని ఆయన పరిశీలించారు. కార్యక్రమంలో భాగంగా గర్భిణులు, చిన్న పిల్లలకు అందుతున్న వైద్య చికిత్సల గురించి వైద్య ఆరోగ్య సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గర్భిణులు, పిల్లలకు వ్యాధి నిరోధక టీకాలు వేయడం వల్ల రోగాల భారిన పడకుండా, నిరోధక శక్తి పెరుగుతుందన్నారు. కాబట్టి సమయానుసారంగా వంద శాతం టీకాలు వేయించాలని సూచించారు. ఈ టీకాలు వేయించడం వల్ల భవిష్యత్‌లో పిల్లలకు ప్రాణాంతక వ్యాధుల నుంచి రక్షణ లభిస్తుందని తెలిపారు. రుబెల్లా, మీజిల్స్ నిర్మూలన కార్యక్రమంలో భాగంగా మీజిల్స్, రుబెల్లా వాక్సిన్‌ను బిడ్డకు 9–16 నెలల వయస్సులో తప్పకుండా వేయించాలని పేర్కొన్నారు. గర్భిణులు ఐరన్, కాల్షియం కలిగిన ఆహార పదార్థాలైన(పండ్లు, పాలు, ఆకుకూరలు, గ్రుడ్లు)ను విరివిగా తీసుకోవడం వల్ల రక్తహీనతకు లోనుకాకుండా ఉంటారని తెలిపారు. కార్యక్రమంలో వైద్యులు కృష్ణబాయి, సామాజిక ఆరోగ్య అధికారులు సుమలత, యశోద, ఆరోగ్య కార్యకర్తలు పాల్గొన్నారు.

ఎయిమ్స్ నుంచి గైనిక్‌లో పీజీ పట్టా



న్యూఢిల్లీలో ఆశాజ్యోతికి పీజీ పట్టాను అందజేస్తున్న ప్రముఖులు

గడివేముల: గడివేముల గ్రామానికి చెందిన శేషాద్రి గౌడ్, విజయలక్ష్మి కుమార్తె ఆశాజ్యోతి కర్నూలు మెడికల్ కాలేజీలో ఎంబీబీఎస్ పూర్తి చేసింది. న్యూఢిల్లీలోని ఆల్ ఇండియా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ (ఎయిమ్స్)లో ఉచితంగా సీటు రావడంతో గైనకాలజీలో పీజీ పూర్తి చేసింది. శనివారం ఢిల్లీలో జరిగిన 49 కాన్వకేషన్ కార్యక్రమంలో ప్రముఖ డాక్టర్ల చేతుల మీదుగా డాక్టర్ ఆశాజ్యోతికి పీజీ పట్టాను అందజేశారు. పీజీలో మంచి ప్రతిభ చూపిన ఆశాజ్యోతిని పలువురు అభినందించారు.

రజకులకు ఇచ్చిన హామీలు అమలు చేయాలి



మాట్లాడుతున్న రజక వృత్తిదారుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి భాస్కరయ్య

కోడుమూరు రూరల్: రజక వృత్తిదారులకు ఎన్నికల్లో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని రజకవృత్తిదారుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి భాస్కరయ్య కోరారు. శనివారం తులజా భవానీ కల్యాణ మండపంలో ఏర్పాటు చేసిన ఏపీ రజక వృత్తిదారుల సంఘం జిల్లా మహాసభలో భాస్కరయ్య మాట్లాడుతూ వివిధ ప్రభుత్వ శాఖల్లో ఖాళీగా ఉన్న ధోబీ పోస్టులను భర్తీ చేసి రజక యువతీ, యువకులకు ఉపాధి కల్పించాలన్నారు. రజకులపై జరుగుతున్న దాడులు, సాంఘిక బహిష్కరణలను అరికట్టేందుకు ఎస్సీ, ఎస్టీ తరహాలో రక్షణ చట్టం అమలు చేయాలన్నారు. పీఎం కౌసల్య విశ్వకర్మ ద్వారా శిక్షణ పొందిన రజకులకు స్టైఫెండ్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. అనంతరం జిల్లా నూతన కమిటీని ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షుడిగా హనుమంతు, అధ్యక్షుడిగా ముక్కన్న, ప్రధాన కార్యదర్శిగా గురుశేఖర్, ట్రెజరర్‌గా శ్రీనివాసులు, ఉపాధ్యక్షులుగా శేషాద్రి, సుంకన్న, శేఖర్‌బాబు, సహాయ కార్యదర్శులుగా జయమ్మ, వీరన్న, బాలును ఎన్నుకున్నారు. కార్యక్రమంలో రజకవృత్తిదారుల సంఘం నాయకులు రామక్రిష్ణ, రాజు, సిద్దప్ప పాల్గొన్నారు.

ముగిసిన అంగన్‌వాడీల శిక్షణ



అంగన్‌వాడీ కార్యకర్తలతో ఐసీడీఎస్ సూపర్‌వైజర్

పాణ్యం: అంగన్‌వాడీ కేంద్రాల్లో పూర్వ ప్రాథమిక విద్యను బలోపేతం చేసేందుకు కార్యకర్తలకు ఏర్పాటు చేసిన మూడు రోజుల శిక్షణ తరగతులు శనివారంతో ముగిసినట్లు ఐసీడీఎస్ సూపర్‌వైజర్ నాగ సుంకమ్మ తెలిపారు. 'పోషణ్‌భీ పడాయి' కార్యక్రమంలో భాగంగా మూడు సంవత్సరాల్లోపు చిన్నారుల సామర్థ్యాలను అంచనా వేసేందుకు నవచేతన, మూడు నుంచి ఆరు సంవత్సరాల్లోపు చిన్నారులకు ఆదర్శిల అనే అంశాలపై అంగన్‌వాడీలకు శిక్షణ ఇచ్చామన్నారు. పిల్లలకు పోషకాహారంతో పాటు అర్థమయ్యేలా సులభరీతిలో విద్యాబోధన చేయాల ని సూచించారు. అనంతరం విద్యాబోధనపై అంగన్‌వాడీ కార్యకర్తలకు చార్ట్‌లను అందజేశారు.

సి.బెళగల్: మండల కేంద్రంలోని స్త్రీ శక్తి భవన్‌లో అంగన్‌వాడీ టీచర్లకు ఇస్తున్న మొదటి విడత శిక్షణ శనివారంతో ముగిసిందని ఐసీడీఎస్ కోడుమూరు ప్రాజెక్ట్ సీడీపీఓ వరలక్ష్మీదేవమ్మ తెలిపారు. చివరి రోజు పోషణబీ, పడాయిబీ కార్యక్రమంలో భాగంగా అంగన్‌వాడీ టీచర్లకు కేంద్రాల నిర్వహణపై సి.బెళగల్ సెక్టార్ ఐసీడీఎస్ సూర్‌వైజర్ మల్లేశ్వరి శిక్షణ ఇచ్చారు.

ప్రమాదాల నివారణకు చర్యలు



బ్రిడ్జి వద్ద సూచికల కోనులను ఏర్పాటు చేస్తున్న ఎస్ఐ

పాణ్యం: పాణ్యం–బనగానపల్లె వైపు వెళ్లే వాహనదారులు వొద్దెలవాగు వద్ద నెమ్మదిగా వెళ్లాలని ఎస్ఐ నరేంద్రకుమార్‌రెడ్డి సూచించారు. శనివారం బ్రిడ్జిని పరిశీలించారు. సైడ్‌వాల్ లేదని, బ్రిడ్జి పూర్తిగా ఇరుకుగా ఉండడం, అటుఇటు మలుపులు ఉండడంతో ప్రమాదాలు జరిగే అవకాశం ఉందన్నారు. వాహనదారులు వేగాన్ని తగ్గించుకోవాలని సూచించారు. ఈ బ్రిడ్జి వద్దనే అనేక ప్రమాదాలు జరుగుతున్న నేపథ్యంలో వాహనదారులకు రాత్రి వేళల్లో బ్రిడ్జి కనిపించేందుకు కోనులకు రేడియం స్టిక్కర్లు ఏర్పాటు చేశామన్నారు. బ్రిడ్జి వెడల్పు పనులు ప్రారంభమయ్యే వరకు వీటిని ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు.